క్లుప్తంగా

చిట్కుల్‌లో కలెక్టర్ పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ క్రాంతి అధికారులతో కలసి పర్యటించారు. సోమవారం రాత్రి ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో ఆమె బస చేశారు. మంగళవారం ఉదయం అధికారులతో కలిసి గ్రామంలోని ప్రకృతి వనం, డంపింగ్‌యార్డ్, నర్సరీ, వైకుంఠధామంతో పాటు పలు వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, చిట్కుల్ గ్రామ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

మునిపల్లి(అందోల్): ప్రతి విద్యార్థి ప్రణాళికబద్ధంగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని బుదేరా కళాశాల ప్రిన్సిపాల్ ఎ. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని బుదేరా ఇంటర్మీడియెట్ కళాశాలలో స్వాగత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చదువులో విద్యార్థులు పోటీతత్వంతో రాణించాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, సుధాకర్, మారుతి, అంబయ్య, విజయప్రసాద్, రమేశ్, సంజయ్, రవి, రమేశ్, హితేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కల్హేర్(నారాయణఖేడ్): ఉమ్మడి మెదక్ జిల్లా రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని మాసాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని హెచ్‌ఎం బి.సురేష్ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాలలో ఈ నెల 3న జరగనున్న పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

డీఎస్సీలో ఐదో ర్యాంకు



నిఖిత (ఫైల్)

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణానికి చెందిన గూడెం నిఖిత డీఎస్సీ ఫలితాల్లో తెలుగు విభాగంలో సెకండరీ స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో ఐదవ ర్యాంకు సాధించింది. తెలుగులో జిల్లాస్థాయిలో 78.03 మార్కులు సాధించింది. ఐదో ర్యాంకు సాధించడంపై పలువురు అభినందించారు.

పింఛన్ మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రాలు అందజేస్తున్న కమిషనర్

పటాన్‌చెరు టౌన్: 'ప్రయాస్ పథకం'లో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే చందారులకు పింఛన్ పత్రాలను మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో సెప్టెంబర్ నెలలో 23 మందికి పింఛన్ మంజూరు కాగా, అందులో 13 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ .. 'ప్రయాస్' చందారులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి, విభాగ పర్యవేక్షకుడు జానకి రామారావు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్

జహీరాబాద్: పట్టణంలోని రైల్వేస్టేషన్, స్టేషన్ ఆవరణలోని ట్రాక్‌పై 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ, రిలయన్స్ ఫైనాన్స్ మేనేజర్ క్రాంతికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీపురులు పట్టుకుని రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. చెత్తను విధిగా కుండీల్లోనే వేయాలని వివరించారు.



సదాశివపేట(సంగారెడ్డి): జీనియస్ పాఠశాల ఆవరణలో..



జహీరాబాద్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నిజాంపూర్ (కె) ప్రభుత్వ పాఠశాలలో..

ముందస్తు సంబరాలు

జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, టీచర్లు తిరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు హాజరయ్యారు. –సాక్షి నెట్‌వర్క్



న్యాల్‌కల్‌లోని శ్రీవాణి విద్యాలయంలో..



జహీరాబాద్ టౌన్: ధనసిరి గ్రామ పాఠశాలలో ..



మునిపల్లి(అందోల్): తాటిపల్లి హైస్కూల్‌లో



కల్హేర్: సిర్గాపూర్‌లో..



నారాయణఖేడ్: సంబురాల్లో ఎమ్మెల్యే సతీమణి, విద్యార్థినులు

సర్వేతో భూ సమస్యల పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): భూ సమస్యల పరిష్కారానికి సర్వే నిర్వహిస్తున్నట్లు ఝరాసంగం తహసీల్దార్ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బిడెకన్నె గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించారు. గ్రామ శివారులోని 42, 56, 89, 101, 106, సర్వే నంబర్ల వారీగా సర్వే చేపడుతున్నామన్నారు. సర్వే అనంతరం ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఐఓ భిక్షపతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, వివిధ మండలాలకు చెందిన సర్వేలు నరసింహులు, లాలూ సింగ్, సుధాకర్ రెడ్డి, శశికాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి మండల అధ్యక్షుడు బుచ్చి రాములు ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి బ్లాక్ ప్రెసిడెంట్ రఘురాం గౌడ్ , పార్టీ నాయకులు ఉన్నారు.

సామాజిక సేవలతో గుర్తింపు

రోటరీ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ కమిటీ కో చైర్మన్ లింగాగౌడ్



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

జహీరాబాద్: సామాజిక సేవలు అందించడం వల్ల స్వచ్ఛంద సంస్థలకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని రోటరీ క్లబ్ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ కో చైర్మన్ లింగాగౌడ్ అన్నారు. పట్టణంలో నిర్వహించిన రోటరీ వార్షిక సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జహీరాబాద్ రోటరీ నూతన చైర్మన్‌గా ఎస్.లాల్‌రెడ్డి, కార్యదర్శిగా టి. రఘునందన్‌రెడ్డిలను నియమించి, ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం లింగాగౌడ్ మాట్లాడుతూ.. జహీరాబాద్ రోటరీ తరఫున ఇటీవల 60 మంది పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. అలాగే, గత ఏడాది తోపుడు బండ్లు అందజేశామని తెలిపారు. మూడు దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రజల మన్ననలు పొందామన్నారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోవింద్ అగర్వాల్, మాజీ అధ్యక్షుడు సంగ్రామ్‌పాటిల్, మాజీ కార్యదర్శి వెంకటేశం, సభ్యులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రుద్రప్పపాటిల్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆందోళన వద్దు

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు
- శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆయిల్‌పామ్ పంట సాగు విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మామిడ్గి రైతు వేదికలో ఉద్యావనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటసాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఆయిల్‌పామ్ పంటలో అంతర పంటలను చేసుకుంటే రైతులకు కొంత మేలు జరుగుతుందన్నారు. చెరకు పంట దిగుబడుల్లో మండలం రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉందన్నారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో 1500 ఎకరాల్లో, జహీరాబాద్ డివిజన్‌లో 800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేశారని, ఇంకా సాగు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎకరాకు రూ.11600 సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం రూ.4200 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో కొత్తూర్(డి)లో ఆయిల్ పామ్ నర్సరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏడీఓ భిక్షపతి, న్యాల్‌కల్ ఏఓ అభినాష్ శర్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలను కూల్చొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరాములు తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చొద్దని వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో చెరువులు, నాలాలు కాపాడాలనే సాకుతో పేదల జీవితాలతో ఆడుకోవద్దని హితవు పలికారు. 2002లో వాల్టా చట్టం, 2010లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జీఓ నంబర్ 157, 2016లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వచ్చిన 168 జీఓ, వీటన్నిటి సారాంశం చెరువులు కుంటలు కాపాడడమేనని అన్నారు. అయితే, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలకు పర్మిషన్ ఇచ్చింది ప్రభుత్వ యంత్రాంగమేనని ఎద్దేవా చేశారు. చెరువులు, నాలాలు, కుంటలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి ప్రజలకు అమ్మిన సంఘటనలు కోకొల్లలు అని మండిపడ్డారు. ఇల్లులు కట్టుకోవడానికి పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోకుండా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమాల ద్వారా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, జిల్లా నాయకులు నర్సింహారెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రేబీస్‌పై అవగాహన తప్పనిసరి

జహీరాబాద్ టౌన్: రేబీస్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి అని పశుసంవర్ధశాఖ వైద్యాధికారి డాక్టర్ కైలాష్ అన్నారు. డీడీఎస్–కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ మహిళా కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువుల నుంచి మనుషులకు ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. పెంపుడు కుక్కలకు టీకాల వేయించాలని, వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కుక్కలు కరిచిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సాయి కిరణ్, కేవీకే శాస్త్రవేత్తలు సాయి, ప్రియాంక, హేమలత, రోజమ్మ పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

పోలీసుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గారెడ్డి

సంగారెడ్డి జోన్: విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పోలీసుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాపూర్ పెద్ద చెరువులోని కూల్చివేత సమయంలో హోంగార్డు గోపాల్ గాయపడిన విషయం తెలుసుకున్న ఎస్పీ చెన్నూరి రూపేష్ పట్టణంలోని ఏబీజీ ఆస్పత్రికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గోపాల్‌కు రావాల్సిన జీతాలు అన్ని సకాలంలో వస్తాయన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగ్గా ఉందని, సోషల్ మీడియా, ఇతర న్యూస్ చానల్‌ల్లో వస్తున్న వార్తలను ఎవరూ నమొద్దన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు



నిరసన తెలుపుతున్న ఏఈఓలు

ఝరాసంగం(జహీరాబాద్): డిజిటల్ క్రాప్‌ను వ్యతిరేకిస్తూ.. తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఏఈఓలు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. మంగళవారం ఝరాసంగంలోని వివిధ క్లస్టర్లలో ఏఈఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి, విధులు కొనసాగించారు. బర్దిపూర్ గ్రామంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సైతం ఏఈఓలు నల్ల బ్యాడ్జీలతో పాల్గొన్నారు.

ఏఈఓల నిరసన

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల పిలుపు మేరకు రైతు నేస్తం కార్యక్రమానికి ఏఈఓలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈఓల సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణ కష్టంగా ఉందన్నారు. సర్వే కోసం గ్రామస్థాయిలో సహాయకులను నియమించాలని కోరారు. ఏఈఓలో ఎక్కువ భాగం మహిళలే ఉన్నారని, వారు నిర్మానుష్య ప్రాంతాలకు ఎలా వెళ్లి సర్వే చేయగలరని ప్రశ్నించారు. ఇప్పటికే తీవ్ర పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నిరసన కార్యక్రమంలో ఈఏఓలు ప్రవీణ్‌కుమార్, రాజు, వీరేందర్, మనోహర్, స్రవంతి, శివప్రియలు పాల్గొన్నారు.

చందు మరణం పార్టీకి తీరనిలోటు

ఎమ్మెల్యే మాణిక్‌రావు



చందు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త ముత్యాల చందు మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ అన్నారు. అనారోగ్యంతో మంగళవారం చందు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, చైర్మన్లు భౌతికాయనికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారని, పట్టణంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్, బీఆర్ఎస్ నాయకులు నామరవికిరణ్, పెంటారెడ్డి, యాకూబ్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సహపంక్తి భోజనం



భోజనం చేస్తున్న కార్మికులు, అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డంప్‌యార్డు ఆవరణను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించారు. తడి, పొడి చెత్తను వేరు చేశారు. అనంతరం ప్రకృతివనం వద్ద కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డుల అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు**

కల్హేర్(నారాయణఖేడ్): ఓ యువకుడిని కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం మంగళవారం తెలిపారు. కల్హేర్‌కు చెందిన సయ్యద్ శర్ఫోద్దిన్‌ను పిట్లకుమార్, అతని ముగ్గురు బామ్మర్దులు కలిసి కిడ్నాప్ చేసి తీసుకెళ్లి, నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద వదిలేశారు. భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడనే అనుమానంతో యువకుడిని కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. శర్ఫోద్దిన్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **గ్రామాల్లో అధికారుల పర్యటన**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని చాల్కి, మెరియంపూర్ గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్, ఎంపీఓ సురేష్ పర్యటించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ **లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి**

పటాన్‌చెరు: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం జిన్నారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కళాశాల విద్యతోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు.

◆ **కంప్యూటర్లు పంపిణీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ పాఠశాలకు మంగళవారం ఓ ప్రైవేట్ సంస్థ సీఎస్ఆర్ నిధులు కింద 20 కంప్యూటర్లు అందజేశారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ మాట్లాడుతూ .. ప్రభుత్వ పాఠశాలలకు సహాయం అందించాలని సంస్థను కోరడంతో వారు ముందుకు వచ్చి 70 కంప్యూటర్లు దశలవారీగా ఇచ్చేందుకు అంగీకరించారు.

◆ **సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమార్ గౌడ్ తెలిపారు. మండలంలోని పెద్దాపూర్‌లో అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

◆ **డీఎస్సీ పీఈటీలో ఫస్ట్ ర్యాంక్**

సంగారెడ్డి : డీఎస్సీ ఫలితాల్లో మండల పరిధిలోని చొటకూరుకు చెందిన గాండ్ల రాజు పీఈటీ విభాగంలో 65 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. రాజుకు టీచర్ ఉద్యోగం రావడంతో కుటుంబ సభ్యులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

◆ **మహిళ అదృశ్యం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఆత్మకూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఆత్మకూర్‌కు చెందిన న్యాలకంటి ఖాజాబీ (47), గత నెల 26న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె కుమారుడు మహమ్మద్ రోషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: మండల కేంద్రం కంగ్టికి చెందిన మదన్ గోపాల్‌కు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.50 వేల చెక్కు మంజూరయింది. సంబంధించిన చెక్కును మంగళవారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల చంద్రశేఖర్ రెడ్డి బాధితుడికి అందజేశారు.

◆ **విద్యార్థులకు పోటీలు**

నారాయణఖేడ్: ఖేడ్‌లో విజేత ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ ఉపన్యాస పోటీల్లో ద్రాక్షావని ప్రథమ, గౌతం సిద్ధార్థ్ ద్వితీయ బహుమతులు, తెలుగు ఉపన్యాస పోటీల్లో అనురాధ ప్రథమ బహుమతిని గెలుపొందారు.వ్యాసరచనలో ద్రాక్షాయని ప్రథమ, వైష్ణవి ద్వితీయ బహుమతులను పొందారు.

◆ **పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక**

కల్హేర్(నారాయణఖేడ్): పీఆర్టీయూ కల్హేర్ మండల శాఖ అధ్యక్షుడిగా పి.రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడు గుండు గోవర్ధన్, అసోసియేట్ అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, కార్యదర్శి, హన్మంతు, శివ భార్గవ్, మహిళా ఉపాధ్యక్షురాలు స్నేహ ఎన్నికయ్యారు. పీఆర్టీయూ మండల శాఖ తరపున ఎంఈఓ జి.శ్రీనివాసులును సన్మానం చేశారు.

◆ **స్వచ్ఛదనం.. పచ్చదనంపై అవగాహన**

పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి, స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు బాధ్యతగా పచ్చదనం, పరిశుభ్రతను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, కరుణకుమారి, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

◆ **తెగుళ్ల నివారణ చర్యలు పాటించాలి**

కల్హేర్(నారాయణఖేడ్): వరి, పత్తి సాగులో తెగుళ్ల నివారణ చర్యలు పాటించాలని ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. నిజాంపేట మండలం బాచేపల్లి శివారులో వరి, పత్తి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరిలో కంకి నల్లి తెగులు నివారణ కోసం స్పైరోమిసిన్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు ఉన్నారు.

◆ **భవానీమాత దీక్షదారుల భోగ్ భండార్**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో భవానీ మాత దీక్షదారులు మంగళవారం భోగ్ భండార్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై భవానీ మాతకు పూజలు చేశారు. మందిరం వద్ద హోమం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు యాదవరావు పాల్గొన్నారు.

◆ **యువకుడిపై కేసు నమోదు**

కల్హేర్(నారాయణఖేడ్): ఓ వివాహిత ఫొటోలు తీసి, బ్లాక్ మెయిల్ పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపారు. మండలానికి చెందిన ఓ మహిళను సయ్యద్ శర్ఫోద్దిన్ అనే యువకుడు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి, శరీరకంగా కలవాలని వేధింపులకు గురిచేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్ : డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ఇలా.. డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10 మందిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.